## కొనసాగిన ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకర్‌రావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన మొదటి సంవత్సరం గణితం-ఎ, వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం పరీక్షలకు మొత్తం 5,108 మందికి 4,757 మంది హాజరయ్యారన్నారు. 351 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. 93 శాతం హాజరు నమోదైందన్నారు. మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి ఐదున్నర గంటల వరకు జరిగిన ద్వితీయ సంవత్సరం గణితం-2ఎ, వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం పరీక్షకు మొత్తం 1,634 మందికి 1,518 మంది హాజరవ్వగా 116 మంది గైర్హాజరయ్యారు. 93 శాతం హాజరు నమోదైంది. జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రభాకర్‌రావు తెలిపారు.

# మహిళా ఓట్లే కీలకం..!

**రెండు జిల్లాల్లో పోలైన ఓట్లలో 29,438 మహిళలవే అదనం**

**8 నియోజకవర్గాల్లో వెయ్యి నుంచి ఐదు వేల ఓట్లు వరకూ హెచ్చు**

**ఏ పార్టీకి ఓట్లు వేశారోనని నాయకుల రకరకాల లెక్కలు**

**పథకాల వైపు మొగ్గు చూపారా.. మార్పు కోరుకున్నారా అని చర్చ**

**గెలుపోటముల్లో మహిళా ఓటర్లే కీలకమని అంచనాలు**

**జిల్లాలోని ఎన్నికల ఫలితాల్లో మహిళా ఓట్లు కీలకం కానున్నాయని అంచనాలు వేస్తున్నారు. అభ్యర్థుల గెలుపోటముల్లో మహిళా ఓట్లు తీవ్ర ప్రభావం చూపనున్నాయని పోలైన ఓట్ల లెక్కలను బట్టి తెలుస్తోంది. ప్రతి నియోజకవర్గంలో మొత్తంగా పోలైన ఓట్లలో పురుషుల కంటే మహిళా ఓట్లే అధికంగా ఉన్నాయి. రెండు జిల్లాల్లోనూ ఎనిమిది నియోజకవర్గాల్లో మహిళా ఓట్ల సంఖ్య వెయ్యి నుంచి ఐదు వేల వరకూ అదనంగా పోలైన పరిస్థితి ఉంది. దీంతో ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై మహిళలు ఓటు వేశారా... ప్రభుత్వ మార్పు దిశగా ఓట్లు వేశారా అని రాజకీయ నాయకులు లెక్కలు కడుతున్నారు.**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,37,430 మంది ఓటర్లు ఉన్నారు. ఈ నెల 13న జరిగిన సాధారణ ఎన్నికల్లో జిల్లాలో 83.65 శాతం పోలింగ్ నమోదైంది. దీనిలో పురుషుల ఓట్లు 6,76,639 పోలవ్వగా, మహిళల ఓట్లు 6,93,172 పోలయ్యాయి. పురుషుల ఓట్లు కంటే 16,533 ఓట్లు మహిళలవే అదనంగా పోలైన పరిస్థితి ఉంది. ఏలూరు నియోజకవర్గంలో పురుష ఓటర్ల కంటే 5,903 మహిళల ఓట్లు అదనంగా వేశారు. దెందులూరులో 2,178 మంది, పోలవరంలో 6,208 మంది, చింతలపూడిలో 1,229 మంది మహిళల ఓట్లు పోలయ్యాయి. ఆయా నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు తీవ్ర ప్రభావం చూపే అవకాశం కన్పిస్తోంది.

పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో మొత్తం 14,72,923 మంది ఓటర్లు ఉండగా 82.60 శాతం ఓట్లు పోలయ్యాయి. పోలైన వాటిలో పురుషుల ఓట్లు 6,02,543 ఉండగా, మహిళల ఓట్లు 6,14,077 ఉన్నాయి. ఈ జిల్లాలోనూ పురుషుల ఓట్లు కంటే 12,905 ఓట్లు మహిళలవే అదనంగా ఉన్నాయి. ఈ జిల్లాలోని ఆచంట నియోజకవర్గంలో 2,998 మహిళా ఓట్లే అదనంగా పోలయ్యాయి. భీమవరంలో 2,482, తణుకులో 4,648, తాడేపల్లిగూడెంలో 1,565 మహిళా ఓట్లు అదనంగా పోలైన పరిస్థితి ఉంది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వెయ్యి లోపులో మహిళా ఓట్లే ఎక్కువగా పోలయ్యాయి. రెండు జిల్లాల్లోని 14 నియోజకవర్గాల్లో ఓటింగ్ సరళి పరిశీలిస్తే ఒక్క నరసాపురం నియోజకవర్గంలో మాత్రమే పురుషుల ఓట్లు 1,371 ఎక్కువగా నమోదయ్యాయి. మొత్తంగా 13 నియోజకవర్గాల్లో మహిళా ఓట్లే అదనంగా పోలైన పరిస్థితి నెలకొంది.

**మహిళలు ఎటువైపు అంటూ చర్చ**

అభ్యర్థుల గెలుపోటముల్లో మహిళల ఓట్లే కీలకం కానుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. ప్రభుత్వ పథకాలు పొందిన మహిళలు అధికార పార్టీవైపే మొగ్గుచూపారని వైసిపి నాయకులు లెక్కలు కడుతుండగా, ఈసారి ప్రభుత్వ మార్పు కోరుకుంటూ మహిళలు ఓట్లు వేశారని టిడిపి కూటమి అభ్యర్థులు అంచనాలు వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో మహిళల ఓట్లు కీలకం కానుండటంతో ఆది నుంచి అభ్యర్థులు వారిని ప్రలోభ పెట్టేందుకు రకరకాల ఎత్తుగడలు సైతం వేశారు. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే డ్వాక్రా మహిళలకు చీరలు, గిఫ్ట్‌లు వంటివి పంపిణీ చేశారు. అంతేకాకుండా డ్వాక్రా గ్రూపులకు ప్రత్యేకంగా డబ్బు పంపిణీ చేశారు. డ్వాక్రా మహిళలను తమకు అనుకూలంగా మలిచేందుకు డ్వాక్రా సిఎలకు, వాలంటీర్లకు సెల్‌ఫోన్లు సైతం బహుమతులుగా అందించారు. ప్రధాన పార్టీలు మహిళలను ఏమార్చేందుకు చేయని ప్రయత్నం లేదు. దీంతో మహిళలు ఎటువైపు ఓటు వేశారోననే ఉత్కంఠ రాజకీయ నాయకుల్లో నెలకొంది. జూన్ నాలుగో తేదీన ఇవిఎంలు తెరిస్తేనే మహిళలు ఎవరికి పట్టంకట్టారో స్పష్టంగా తెలియనుంది.

**ఏలూరు జిల్లాలో పోలైన ఓట్లు..**

| నియోజకవర్గం | పోలైన ఓట్లు | పురుషుల ఓట్లు | మహిళా ఓట్లు | అదనంగా మహిళా ఓట్లు |
|---|---|---|---|---|
| ఉంగుటూరు | 1,81,164 | 90,481 | 90,678 | 197 |
| దెందులూరు | 1,92,901 | 95,360 | 97,538 | 2,178 |
| ఏలూరు | 1,65,132 | 79,607 | 85,510 | 5,903 |
| పోలవరం | 2,18,366 | 1,06,077 | 1,12,285 | 6,208 |
| చింతలపూడి | 2,22,608 | 1,10,679 | 1,11,908 | 1,229 |
| నూజివీడు | 2,10,155 | 1,05,051 | 1,05,102 | 51 |
| కైకలూరు | 1,79,536 | 89,384 | 90,151 | 767 |
| మొత్తం | 13,69,862 | 6,76,639 | 6,93,172 | |

**పశ్చిమగోదావరిలో పోలైన ఓట్లు..**

| నియోజకవర్గం | పోలైన ఓట్లు | పురుషుల ఓట్లు | మహిళా ఓట్లు | అదనంగా మహిళా ఓట్లు |
|---|---|---|---|---|
| ఆచంట | 1,49,048 | 73,024 | 76,022 | 2,998 |
| పాలకొల్లు | 1,60,489 | 79,802 | 80,684 | 882 |
| భీమవరం | 2,00,857 | 99,174 | 1,01,656 | 2,482 |
| ఉండి | 1,93,722 | 96,695 | 97,025 | 330 |
| తణుకు | 1,92,736 | 94,042 | 98,690 | 4,648 |
| తాడేపల్లిగూడెం | 1,75,990 | 87,208 | 88,773 | 1,565 |
| నరసాపురం | 1,43,825 | 72,598 | 71,227 | -1,371 |
| మొత్తం | 12,16,667 | 6,02,543 | 6,14,077 | |

## సీతాదేవి మృతితో విషాదఛాయలు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

సీతాదేవి (ఫైల్‌ఫొటో)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీమంత్రి ఎర్నేని సీతాదేవి సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని తన కుమార్తె నివాసంలో గుండెపోటుతో మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆమె భర్త ఎర్నేని నాగేంద్రనాథ్ గతేడాది మరణించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆమె అంత్యక్రియలు బుధవారం కలిదిండి మండలం కొండూరు గ్రామంలో జరగనున్నట్లు నాయకులు తెలిపారు. సీతాదేవి మృతి పట్ల టిడిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర సంతాపం తెలిపారు.

**సీతాదేవి రాజకీయ ప్రస్థానం ఇలా**

ఎర్నేని సీతాదేవి 1983లో తెలుగుదేశం పార్టీ తరపున ముదినేపల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం 1985లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి గెలుపొందారు. 1988లో ఎన్‌టిఆర్ మంత్రివర్గంలో కొంతకాలంపాటు ఆమె రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 1989లో జరిగిన ఎన్నికల్లో ఆమెకు టిక్కెట్ దక్కలేదు. 1994లో మళ్లీ ఆమె పోటీ చేసి గెలుపొందారు. 1999, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసినా ఓటమి పాలయ్యారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో ముదినేపల్లి నియోజకవర్గం రద్దయి కైకలూరు నియోజకవర్గంలో కలిసింది. అనంతరం సీతాదేవి కొంతకాలంపాటు ఖాళీగా ఉన్నారు. 2013లో బిజెపిలో చేరారు. కొంతకాలం తర్వాత మళ్లీ టిడిపి గూటికి చేరారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి కూటమి అభ్యర్థి కామినేని శ్రీనివాస్ తరపున ఎన్నికల ప్రచారం చేశారు. ప్రస్తుతం సీతాదేవి విజయ డెయిరీ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఆమె మంత్రిగా పని చేస్తున్న కాలంలో ముదినేపల్లిలో ఆర్‌టిసి బస్టాండ్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు, పోల్‌రాజ్ కెనాల్, పోల్‌రాజ్ డ్రెయిన్‌పై వంతెనల నిర్మాణం, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

**సిపిఎం సంతాపం**

ఏలూరు అర్బన్: మాజీమంత్రి, విజయ డెయిరీ డైరెక్టర్ ఎర్నేని సీతాదేవి మరణం పట్ల సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఆ కమిటీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సీతాదేవి భర్త, రైతు ఉద్యమ నాయకుడు అయిన ఎర్నేని నాగేంద్రనాథ్ ఇటీవలే మరణించారని, వీరు ఇరువురు రైతు ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించారని కొనియాడారు.

## పొరపాట్లకు తావు లేకుండా ఓట్ల లెక్కింపు

**సిబ్బందికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశం**

**ప్రజాశక్తి - ఏలూరు**



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఎటువంటి పొరపాట్లకూ తావులేకుండా ఓట్ల లెక్కింపు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బందికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ సూర్యతేజ, డిఆర్‌ఒ డి.పుష్పమణి, రిటర్నింగ్ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియలో మొదటి భాగమైన పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించారని సిబ్బందిని అభినందించారు. అదే స్ఫూర్తితో తదుపరి అంకమైన కౌంటింగ్ ప్రక్రియను కూడా పారదర్శకంగా ప్రశాంత వాతారణంలో నిర్వహించాలన్నారు. ఏలూరులోని సిఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో జూన్ 4న ఉదయం ఏడు గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తారని, ఓట్ల సంఖ్యను బట్టి 16 నుండి 21 రౌండ్ల వరకు కౌంటింగ్ ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బంది ఎటువంటి కంగారు, గందరగోళం లేకుండా ప్రశాంతమైన మనస్సుతో కౌంటింగ్ విధులకు హాజరు కావాలన్నారు. కౌంటింగ్ సిబ్బంది విధులకు సంబంధించిన ర్యాండమైజేషన్ అదేరోజు ఉదయం ఐదు గంటలకు జరుగుతుందని, సిబ్బంది అందరూ ఉదయం 6 గంటలకు కౌంటింగ్ సెంటర్ వద్ద హాజరుకావాలని అన్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద సిబ్బందికి ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశామని, అల్పాహారం అనంతం సిబ్బంది ర్యాండమైజేషన్‌లో తమకు కేటాయించిన నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్ సెంటర్‌కు వెళ్లి రిటర్నింగ్ అధికారికి రిపోర్టు చేయాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం జారీ చేసిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. శిక్షణా సమయంలో అన్ని అంశాలపై క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవాలని, ఏదైనా సమస్య ఎదురైతే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపులో ఎన్నికల కమిషన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని, వాటిని సిబ్బందికి శిక్షణలో తెలియజేయడమేకాక, శిక్షణా ప్రదేశంలో ప్రాక్టికల్ శిక్షణ నిమిత్తం డెమో కూడా నిర్వహిస్తున్నామన్నారు. సరైన కారణం లేకుండా పోస్టల్ బ్యాలెట్ ఓటును తిరస్కరించకూడదన్నారు. సిబ్బంది డెమో ద్వారా మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. సిబ్బంది తమ సందేహాలను శిక్షణాధికారి చక్రపాణిని అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, ఏలూరు ఆర్‌డిఒలు ఎన్ఎస్‌కె.ఖాజావలీ, కె.అద్దయ్య, వై.భవానీశంకరి, డిపిఒ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, ఏలూరు ఆర్ఒ ముక్కంటి, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, వివిధ శాఖల అధికారులు, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలుగునాట తొలి సంఘ సంస్కర్త కందుకూరి

**105కుపైగా సంఘాలతో కందుకూరి 105వ వర్ధంతి**

**ఆకట్టుకున్న సమాలోచన కార్యక్రమాలు**

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి

తెలుగునాట తొలి సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. కందుకూరి వీరేశలింగం 105వ వర్ధంతి సందర్భంగా సిఆర్‌రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో సోమవారం కందుకూరి 105వ వర్ధంతి నిర్వహణ కమిటీ, సర్ సిఆర్‌రెడ్డి విద్యాసంస్థలు తెలుగు విభాగం సంయుక్తంగా 'కందుకూరి 105వ వర్ధంతి సమాలోచన' కార్యక్రమాన్ని నిర్వహిం చాయి. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం, సిఆర్‌ఆర్ విద్యాసంస్థలు, మానవత, జనవిజ్ఞాన వేదిక, హిందూ యువజన సంఘం, జిల్లా రచయితల సంఘం, హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం వంటి 115 సంఘాలతో కందుకూరి 105వ వర్ధంతి నిర్వహణ కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి పలు కళా ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత జనవిజ్ఞాన వేదిక నాయకులు చేతిపై కర్పూరం వెలిగించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూలమాల, పుష్పాలతో నివాళులర్పించారు. ప్రముఖ నాట్యాచార్యులు పార్వతి రామచంద్రన్ శిష్య బృందం, రామానుజ నృత్యధార విద్యార్థులు, స్వర్ణ నృత్యాలయ విద్యార్థులు పలు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. విజయవాడకు చెందిన ప్రజా గాయకులు ఆకురాతి జగన్, ప్రజానాట్య మండలి గాయ కులు పి.మంగరాజు ఆలపించిన గేయాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కళాకారుడు హమీద్ ప్రదర్శించిన కందుకూరి వీరేశలింగం ఏకపాత్రాభినయం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సదస్సుకు అధ్యక్షత వహించిన ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లా డుతూ కందుకూరి మంచి సంఘసంస్కర్త, అభ్యుదయవాది, పోరాటయోధుడు, కవి, ఉపాధ్యాయుడు, రచయిత అని, అన్ని మంచి లక్షణాలు ఒకే వ్యక్తిలో ఉండటం గొప్ప విషయమని అన్నారు. సిఆర్‌రెడ్డి కళాశాల రిటైర్డ్ అధ్యాపకులు ఇమ్మానుయేల్ మాట్లాడుతూ ఈ సృష్టిలోని ప్రతి ప్రాణిలో పుట్టుక, అభివృద్ధి, మరణం అనే మూడు తప్పనిసరిగా ఉంటాయని, కానీ కొందరిలో మాత్రమే సమాజాన్ని సంస్కరించాలనే లక్ష్యం ఉంటుందని అన్నారు. భారతదేశ నాగరికత ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా విరాజిల్లిందని, అయితే ఇక్కడి మూఢ నమ్మకాల వల్ల ఒక సమయంలో అది పతనానికి చేరిం దన్నారు. ఆ సమయంలో దేశంలో రాజారామ్మోహ న్‌రా య్‌లాంటి సంస్కర్తలు మళ్లీ భారతదేశ సంస్కృతికి పునరుజ్జీవం తెచ్చేందుకు ప్రయత్నించారని, ఆంధ్ర రాష్ట్రంలో కందుకూరి వీరేశలింగం తొలి సంస్కర్త అని తెలిపారు. దేశంలో ఉన్న అనేక సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు కందుకూరి ఎంతో శ్రమించారని, ఈ విషయంలో ఆయనకు ఎన్నో ఆటంకాలు ఎదురైనా వెనకడుగు వేయ కుండా ఉద్య మించారని తెలిపారు. పత్రికలు స్థాపించి పత్రికల ద్వారా ప్రజలను చైతన్య పరిచారని, బాల్యవివాహాల నిరోధం, వితంతు వివాహాలు జరిపించడంలోనూ ఆయన తనవంతు కృషి చేశారన్నారు. అనేక కాలేజీలు స్థాపించి వాటి నిర్వహణ కోసం తన ఆస్తులు రాసిచ్చారని తెలిపారు. సెయింట్ థెరిస్సా డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.అరుణ మాట్లాడుతూ స్త్రీ విద్య, వితంతు వివాహాల కోసం ఎన్నో కలుపు మొక్కలను ఏరిపారేసిన గొప్ప సైనికుడు, గొప్ప సాహితీవేత్త కందుకూరి అని కొనియాడారు. మాతృభాష పరిరక్షణ కోసం పరితపించిన వ్యక్తి అని గుర్తు చేశారు. సాహిత్యంలో తెలుగు పదాలు వెతుక్కునే పరిస్థితి నేడు సమాజంలో ఉందని, ఈ పరిస్థితుల్లో తెలుగు భాషా ప్రామాణికతను కాపాడే దిశగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రిటైర్డ్ ఎస్ఐ ఎం.జాన్‌మిల్టన్ రచించిన 'పోలీస్ స్టేషన్ గురించి తెలుసుకోవాల్సిన విషయాలు' అనే పుస్తకాన్ని రిటైర్డ్ ఎఎస్‌పి భగవాన్ రాజు ఆవిష్కరించగా, కె.కేశవరెడ్డి రచించిన, హేలాపురి బాలోత్సవం ప్రచురించిన 'కార్యశూరుడు కందుకూరి' అనే పుస్తకాన్ని మాజీ ఎంఎల్‌సి రాము సూర్యారావు చేతుల మీదుగా ఆవిష్కరించారు. భోజనానంతరం కందుకూరి బాటలో మహిళా చైతన్యం అనే అంశంపై జరిగిన సదస్సులో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ స్త్రీల స్థితి బాగుపడనిదే దేశం బాగుపడదని విశ్వసించిన వీరేశ లింగం మహిళలను చైతన్య పరిచేందుకు, వారి విద్య కోసం ఎనలేని కృషి చేశారన్నారు. గృహిణుల కోసం ప్రత్యేక విద్యా సంఘాలను ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు కందుకూరిని స్ఫూర్తిగా తీసుకుని హక్కుల కోసం, రక్షణ కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. హేలాపురి బాలోత్సవం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య, సిఆర్‌ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి ఎంబిఎస్‌వి.ప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ సంకు మనోరమ, సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు వొరప్రసాద్ పాల్గొన్నారు.

కందుకూరి ఏకపాత్రాభినయం

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

## 1న ఉమ్మడి పశ్చిమగోదావరి జెడ్‌పి సర్వసభ్య సమావేశం

**ప్రజాశక్తి - ఏలూరు**

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ ఒకటో తేదీన ఏలూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి జెడ్‌పిటిసిలు, జిల్లా అధికారులు, ఆహ్వానితులు సకాలంలో హాజరుకావాలని సుబ్బారావు విజ్ఞప్తి చేశారు.

## 'పది' ఇంగ్లీషు పరీక్షకు 48 మందే హాజరు

**ప్రజాశక్తి - ఏలూరు సిటీ**

జిల్లావ్యాప్తంగా సోమవారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ ఇంగ్లీషు పరీక్షకు 2186 విద్యార్థులకు 48 మంది మాత్రమే హాజరయ్యారని, 1698 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డిఇఒ ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. మూడో రోజు మొత్తం 17 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

**1698 మంది గైర్హాజరు**

## 20న ఆక్వా రైతులతో సదస్సు

**ప్రజాశక్తి - పాలకొల్లు**

జూన్ 20వ తేదీన పాలకొల్లులో వివిధ జిల్లాల ఆక్వా రైతులతో సదస్సు ఏర్పాటు చేసినట్లు జై భారత్ క్షీరా రామ ఆక్వా రైతు సంఘం అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు చెప్పారు. సోమవారం స్థానిక ఎస్-ఎస్ఎస్ కళ్యాణ మండపంలో జరిగిన రైతు ప్రతినిధుల సమావేశం వివరాలను మీడియాకు తెలిపారు. మార్చిలో చలో భీమవరానికి తాము పిలుపు ఇవ్వగా రొయ్య ప్రాసెసింగ్, ఫీడ్, సీడ్ యాజమాన్యం తొందరపడొద్దని, రైతులకు న్యాయం చేస్తామని చెప్పారని చెప్పారు. అయితే రైతులకు న్యాయం చేయకపోగా ప్రస్తుతం దారుణ రేట్లకు రొయ్యలు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. దీంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకు పోయారని చెప్పారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 20న అన్ని జిల్లాల రైతులతో సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు మేడిది జాన్ రాజు, సహాయ కార్యదర్శి మేకా ఫణేంద్ర, కోడి విజయభాస్కర్, పెన్మెత్స సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలు ఆపాలని వినతులు

**ప్రజాశక్తి - బుట్టాయగూడెం**



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి అందిస్తున్న నేతలు

ఆదివాసీ చట్టాలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలని కోరుతూ ఏపి గిరిజన సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్‌కు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని 1/59, 1/70 చట్టాలకు విరుద్ధంగా అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు చేస్తున్న వారిపై తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయాలని అధికారులను కోరామన్నారు. తహశీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న స్థలంలో శివాలయం ఎదురుగా ఉన్న స్థలంలో, రామారావు పేట సెంటర్ వద్ద చేపట్టిన అక్రమ నిర్మాణాలకు ఎటువంటి అనుమతులూ లేవని, వీటిపై వెంటనే చర్యలు చేపటి నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. డిప్యూటీ తహశీల్దార్ రమేష్‌కు, బుట్టాయగూడెం పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కు, రెడ్డిగణపవరం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాలు అందించారు. తక్షణమే చర్యలు చేపట్టకపోతే గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గొడ్డా పవన్, కె.జలపాలు తదితరులు పాల్గొన్నారు.

## రోహిణితో జనం విలవిల

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

రోహిణీ కార్తె ప్రారంభం కావడంతో ఒక పక్క ఎండ, మరోపక్క వడగాల్పులతో మండలంలోని ప్రజలు విలవిల్లాడారు. అక్కడక్కడా వరి రాశుల వద్ద మాసూళ్లు చేసుకొనే రైతులు, కౌలు రైతులు, కార్మికులు ఎండ, గాల్పులతో ఇబ్బంది పడుతూ పనులు చేసుకుంటున్నారు. అలాగే మండలంలో పలు చోట్ల చేపల చెరువుల్లో ఆక్సిజన్ అందక చేపలు తేలిపోతుండడంతో ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొన్ని రోజులు ఇలాగే ఉంటుందని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సంబంధిత అధికారులు తెలిపారు.

**ఆకివీడు :** జనం పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్టు తయారైంది. రోహిణీ కార్తె ప్రవేశించి నాలుగు రోజులైనా మొదటి రెండు రోజులు ఆకాశం మేఘావృతంగా ఉండడంతో పెద్దగా ఇబ్బంది లేదు. రెండు రోజుల నుంచి మాత్రం వేడిగాలుల తీవ్రత పెరిగింది. వేడిగాలులు మొదలవ్వడంతో జనం విలవిల్లాడిపోతున్నారు. ఉదయం తొమ్మిది దాటితే బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. రోహిణీ వెళ్లే వరకూ తిప్పలు తప్పవని అంటున్నారు.

## స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రత పరిశీలన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నియోజకవర్గ ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతను జాయింట్ కలెక్టర్, ఆ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.లావణ్యవేణి సోమవారం తనిఖీ చేశారు. ఏలూరులోని సరోసిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇవిఎంల స్ట్రాంగ్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ భద్రతను పరిశీలించిన జెసి, ఆర్‌ఒ లావణ్యవేణి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతిరోజూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతను పరిశీలించాల్సి ఉందన్నారు. ఇవిఎంలు భద్రపరిచిన రూమ్‌ల తలుపులకు వేసిన తాళాలను, తాళాలకు ఉన్న సీళ్లను, సిసి కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో జెసి సంతకం చేశారు.

## కార్పొరేట్ పాఠశాలల దోపిడీ

### అరికట్టాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - చాట్రాయి

ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలు పుస్తకాలు, యూనీఫాం పేరుతో డబ్బులు గుంజుతున్నారని ఎస్ఎఫ్ఐ నూజివీడు పట్టణ కమిటీ సభ్యులు అశోక్ అన్నారు. రూ.వేలు అడ్డగోలుగా ముక్కు పిండి వసూలు చేస్తున్నారన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారన్నారు. తమ పిల్లలను ప్రయివేట్ పాఠశాలలో చదివించడానికి నానా అవస్థలు పడి రూ.వేలు చెల్లిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల బలహీనతను ఆసరాగా తీసుకుని కార్పొరేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా రూ.వేల దోపిడీకి పాల్పడుతున్నాయన్నారు. అధిక శాతం ప్రయివేట్ పాఠశాలల్లో ఆట స్థలం, కనీస మౌలిక వసతులు లేవన్నారు. అయినా విద్యాశాఖాధికారులు అనుమతులు ఇస్తున్నారన్నారు. పుస్తకాలు, యూనిఫాం పేరుతో ఈ ఏడాది గతంలో ఎన్నడూ లేని విధంగా దోపిడీ చేయడానికి సిద్ధమయ్యారన్నారు. విద్యాశాఖాధికారులు స్పందించి ఈ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు.

## అటవీ శాఖ ప్లాంటేషన్ల అభివృద్ధికి కృషి

### జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్రధామ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అటవీ శాఖ ఆధ్వర్యంలో నూతన ప్లాంటేషన్ల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి రవీంద్రధామ తెలిపారు. మండలంలోని ములగలంపల్లి బీట్ పరిధిలోని పి.నారాయణపురం విఎస్ఎస్.పరిధిలో 2023 సంవత్సర కాలంలో నాటిన మారుజాతి మొక్కల నూతన ప్లాంటేషన్లను ఆయన సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్లాంటేషన్లలోని మొక్కలు సజావుగా పెరుగుతుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీశాఖ పరిధిలో ఉన్న ప్లాంటేషన్ల వృద్ధి చేసి అటవీశాఖ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం కామయ్యపాలెం బీట్ పరిధిలోని రాచన్నగూడెం ప్రాంతంలో నూతన ప్లాంటేషన్ వేయదగిన గల అటవీ శాఖ భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్.కె.ఎలీ, సెక్షన్ అధికారులు దినేష్, రాంబాబు, బీట్ అధికారి మారేష్, భవాని, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిడిఒకు ఉపాధి హామీ మేట్ల ఫిర్యాదు

ప్రజాశక్తి - ముసునూరు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా రోజువారీ పని వివరాలు తమకు తెలియపర్చడం లేదని ముసునూరు గ్రామ మేట్లు ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవికి వివరించారు. ముసునూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిడిఒ పద్మావతి దేవిని ముసునూరు గ్రామానికి చెందిన రెడ్డి నరసింహారావు, పంజుగుల నరసింహారావు, రెడ్డి సాయిబాబు, రత్తయ్య, వెంకటేశ్వరరావు, గంగరాజు, సత్యనారాయణలు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ తమకు పని వివరాలు సక్రమంగా వారు ఎంపిడిఒకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు.

## టిడిపి కూటమికి అండగా మహిళలు

### చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సంక్షేమం పేరుతో పేదలకు ఒకవైపు రూపాయి ఇచ్చి, మరోవైపు పది రూపాయలు దోచుకున్న వైసిపి ప్రభుత్వానికి ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెప్పారని, ఆ ఫలితాలు వచ్చే నెలలో తేలనున్నాయని ప్రజలు మొత్తం చూడబోతున్నారని, ఎన్నికల్లో మహిళా లోకం మొత్తం టిడిపి కూటమికి అండగా నిలిచారని టిడిపి దెందులూరు ఎంఎల్ఎ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అన్నారు. దెందులూరు నియోజకవర్గంలోని పెదపాడు, దెందులూరు సహా ఏలూరు రూరల్ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు చింతమనేని ప్రభాకర్‌ను దుగ్గిరాలలోని ఆయన కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. తమ గ్రామాల్లో జరిగిన పోలింగ్ సరళిని చింతమనేనికి వివరించారు. చింతమనేని మాట్లాడుతూ పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెదవేగి మండలాధ్యక్షులు బొప్పన సుధా, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, ఉప్పలపాటి రామ్‌ప్రసాద్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, కొల్లేటి గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

## పోలవరంలో బహిరంగ వేలం పాట

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం పంచాయతీలో సర్పంచి పాడెం పుష్ప ఆధ్వర్యంలో వారపు సంత, డైలీ మార్కెట్ పన్నుల వసూలు, కబేళా, బహిరంగ వేలం పాట సంవత్సరానికి సోమవారం నిర్వహించారు. ఈ పాటలో ముగ్గురు పాల్గొనగా డైలీ మార్కెట్ పాటను రూ.1.62 లక్షలకు, కబేళా పాటను రూ.10 వేలకు పాటదారు వెంకటేశ్వరరావు పాడారు. వారపు సంత పాటను రూ.42 వేలకు పాడెం శ్రీను, కొబ్బరి పెట్ట పాటను రూ.ఐదు వేలకు కోరిశెల శ్రీను పాడినట్టు పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు తెలిపారు.

## నేరాలు - ఘోరాలు

## ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కుటుంబ కలహాల నేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఏలూరులో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు నగరంలోని ఒకటో పట్టణ ప్రాంతంలో నివాసం ఉంటున్న ప్రాంతానికి చెందిన వై.వికాస్ తండ్రి చనిపోవడంతో కారుణ్య నియామకంలో పట్టభద్రుడైన వికాస్‌కు కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగం వచ్చింది. వికాస్‌కు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం వికాస్ పోలవరం భూ సేకరణ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఆలస్యంగా అర్ధరాత్రి ఇంటికి చేరుకున్న వికాస్ ఇంట్లో కుటుంబ సభ్యులతో కొంతసేపు వాగ్వివాదానికి దిగాడు. అనంతరం గదిలోకి వెళ్లి తన స్నేహితులకు వీడియో కాల్ ద్వారా తాను చనిపోతున్నానని తెలిపాడు. గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్నేహితులు, బంధువులు ఆ గదికి వెళ్లి చూడగా అప్పటికే అతను వేలాడుతూ కనిపించాడు. వికాస్‌ను కిందకు దింపి ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే వికాస్ మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలో భద్రపరిచారు. ఒకటో పట్టణ ఎస్ఐ నవీన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాలే ఆత్మహత్యకు కారణమని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

## నాటుసారా విక్రేత అరెస్టు

ఆగిరిపల్లి : మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో ఎస్ఐ బి.సురేంద్రకుమార్ తన సిబ్బందితో కార్డెన్ సెర్చ్ నిర్వహించి సారా అమ్ముతున్న మహిళ మదేపు రమాదేవిని అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

## ఇసుక అక్రమ రవాణా : వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏపిగుంట పంచాయతీలోని శ్రీరామవరం గ్రామ శివార్లలోని ఎర్ర కాలువ నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, ట్రాక్టరు, ఒక యూనిట్ ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# సూర్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

## కరస్పాండెంట్ సూర్యచంద్ర శ్రీనివాసరావు

సూర్యచంద్ర శ్రీనివాసరావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉన్నత విలువలతో ఉజ్వల భవిష్యత్తును సాధించే పరిపూర్ణ విద్యార్థులను సమాజానికి అందించడమే లక్ష్యంగా జంగారెడ్డిగూడెం సూర్య విద్యాసంస్థల లక్ష్యమని కరస్పాండెంట్ ఈడ సూర్యచంద్ర శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, డిగ్రీ కోర్సులను ఆఫర్ చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఉన్నత స్థాయి, ఉత్తమ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రపంచ పటంలో జంగారెడ్డిగూడేనికి చెందిన విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభించే విధంగా సహకరించడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. 1997లో 50 మంది విద్యార్థులతో జూనియర్ కళాశాలను మొదలుపెట్టి, దిన దినాభివృద్ధి సాధిస్తూ స్టేట్ ర్యాంకులతో జంగారెడ్డిగూడెం పట్టణం మొదటి స్థానంలో ఉండే విధంగా బాటలు వేసుకుంటూ, 2002లో డిగ్రీ విద్యా కోర్సులు మొదలుపెట్టామన్నారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2024లో హైస్కూల్ స్థాయి విద్యను కూడా ప్రారంభించి, ప్రతి ఏడాది అన్ని తరగతుల్లో నూటికి నూరు శాతం విజయం సాధిస్తూ ప్రగతి పథంలో సూర్య విద్యాసంస్థ ముందుకు దూసుకెళ్తుందన్నారు. నాటి ఎంసెట్ నుంచి నేటి నీట్ పరీక్షల వరకు ఐఐటి విద్యా విధానంలో ప్రతి ఏడాది సూర్య విద్యార్థులు సీట్లు సాధిస్తున్నారన్నారు. అంతేకాకుండా భరతనాట్యం, కూచిపూడి, డ్యాన్స్ వంటి కళలకు ప్రాధాన్యతనిస్తూ మానసికోల్లాసాన్ని పెంపొందిస్తూ, డబల్ ఐటి, ట్రిపుల్ ఐటి, నీట్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ, రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన సామాన్య విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సు ద్వారా శిక్షణ ఇచ్చి అసమాన్య ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకి కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పడంతో పాటు విదేశీ విద్యను అభ్యసించేందుకు ఆ ప్రాంతానికి చెందిన భాష, అవసరమైన ఇతర అంశాలపై ప్రత్యక్ష శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సామాజిక స్నేహం, కుటుంబ విలువలు, గౌరవప్రద జీవనం పట్ల అవగాహన కల్పిస్తున్నామన్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్, టివి ఎక్కువగా వాడటం వల్ల కలిగే దుష్ఫలితాలను వివరిస్తూ వారిని విజ్ఞానవంతులుగా చేసేందుకు పుస్తక పఠనాన్ని ప్రోత్సహిస్తున్నామని, అందుకు అవసరమైన గ్రంథాలయాన్ని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం అన్ని తరగతుల్లో నూటికి నూరు శాతం విజయం సాధించామన్నారు. ఇంటర్‌లో 988 మార్కులతో యు.రేష్మిత మండల స్థాయి మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. 985 మార్కులతో వి.గాయత్రి, 983 మార్కులతో కె.సత్యప్రియా విజయదుందుభి మోగించారన్నారు. తమ విద్యాసంస్థలో చదివిన విద్యార్థులు మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారన్నారు. డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, ఐపిఎస్ క్యాడర్ ఆఫీసర్లుగా ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేసేందుకు తమ విద్యాసంస్థలు ఎంతగానో కృషి చేస్తున్నాయని తెలిపారు.

సూర్యవిద్యాసంస్థలు

# రైతాంగ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లారి సోమశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ షకీలాకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సోమశేఖర్, కృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా ఇంకా విత్తనాలు సరఫరా చేయడం లేదన్నారు. అదేవిధంగా పంట రుణాలు విడుదలకు ఆదేశాలు ఇవ్వాలని, అన్ని రకాల విత్తనాలు 90 శాతం రాయితీపై అందించాలని కోరారు. కౌలు రైతుల గుర్తింపు ప్రక్రియ ప్రారంభించి రైతులకు ఇచ్చే మాదిరిగానే కౌలు రైతులకు కూడా రాయితీపై విత్తనాలు, రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సిపిఐ మండల కార్యదర్శి గురవయ్య, సహాయ కార్యదర్శి బాబు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.జాని పాల్గొన్నారు.

**ముసునూరు** : ముసునూరు మండలంలోని 16 గ్రామాల్లోని రైతులు ఖరీఫ్ సీజన్‌కు సన్నద్ధమవుతున్న సందర్భంలో జీలుగు, పిల్లి పెసర, జనుము వంటి విత్తనాలతో పాటు వరి వంగడ విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందించాలని రైతు సంఘం జిల్లా నాయకులు రాయ్యంకుల లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు ఆయన తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ పప్పుధాన్యాలు, వరి వంగడాలు 90 శాతం రాయితీపై ఇవ్వాలని కోరారు. గతేడాది తుపాన్ల వల్ల నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇంకా కొందరికి అందలేదన్నారు. అలాగే బ్యాంకు వారు పాత బకాయిలతో నూతన రుణాలు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సిపిఐ నూజివీడు డివిజన్ ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు, మడుపల్లి వెంకట నాగేంద్రరావు, రైతు సంఘం నూజివీడు డివిజన్ కార్యదర్శి పండుబాబు పాల్గొన్నారు.

**కుక్కునూరు** : ఖరీఫ్ సీజన్ ప్రారంభ సందర్భంగా రైతులకు పత్తి విత్తనాలు, వరి ఇతర పంటలకు సంబంధించిన విత్తనాలు రాష్ట్ర ప్రభుత్వం 90 రాయితీతో అందించాలని రైతు సంఘం మండల నాయకులు, సిపిఐ కుక్కునూరు మండల కార్యదర్శి మైసాక్షి వెంకటాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర రైతు సంఘం పిలుపులో భాగంగా సోమవారం కుక్కునూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం మండల సమితి ఆధ్వర్యంలో ధర్నా చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటాచారి మాట్లాడుతూ గతేడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతాంగం తీవ్ర నష్టపోయిందన్నారు. రైతులకు నష్టపరిహారం, పంటల బీమా ఇప్పటివరకు సక్రమంగా చెల్లించలేదన్నారు. మండలంలో రైతులకు ఎక్కువ శాతం పత్తి విత్తనాలను ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోడే రమేష్, సోడే మంగయ్య, మడివి సోమయ్య, పిట్ట దేవా, సోడే రాజు, కమల్ పాల్గొన్నారు.

## పలుచోట్ల కందుకూరి వీరేశలింగం వర్ధంతి సభలు

ప్రజాశక్తి - చింతలపూడి

కందుకూరి వీరేశలింగం మహిళలందరికీ విద్య అందాలని ఆశించారని, బాల్య వివాహాలను వ్యతిరేకించారని ప్రజా సంఘాల నాయకులు ఎస్.సూర్యకుమార్ అన్నారు. ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 105వ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరేశలింగం చిత్రపటానికి మహిళా సంఘం నాయకులు ఎం.వరలక్ష్మీదేవి, పి.గోపలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యకుమార్ మాట్లాడుతూ కందుకూరి వీరేశలింగా వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించారన్నారు. ఎన్.అశోక్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే అనేక రచనలను కందుకూరి వీరేశలింగం అందించారన్నారు. మూఢ నమ్మకాలను ప్రతిఘటించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.రాహుల్, ఎం.బాలరాజు, ఆర్‌విఎస్.నారాయణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

**కామవరపుకోట** : స్థానిక గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు 105వ వర్ధంతి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కామవరపుకోట శాఖ గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు అధ్యక్షత వహించారు. రాష్ట్ర కార్యదర్శి బివిఎన్.సాగర్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కవిగా, రచయితగా, సంఘసంస్కర్తగా కందుకూరి వీరేశలింగం పంతులు తెలుగు సమాజానికి చేసిన సేవలు అనిర్వచనీయమన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఆ రోజుల్లోనే తీవ్రంగా పోరాటం చేశారన్నారు. ఈ సమకాలీన పరిస్థితుల్లో వీరేశలింగం వంటి మహనీయుల చరిత్రను వారి రచనలను భావితరాల వద్దకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు ఈ కార్యక్రమంలో గదుల రామస్వామి, సత్యనారాయణ, కంకిపాడు బుచ్చిబాబు, జి.సత్యనారాయణ, నల్లపోతుల శ్రీనివాసరావు, శెట్టి నాగబాలాజీ పాల్గొన్నారు. స్థానిక గ్రంథాలయ అధికారి ఎం.భీమరాజు వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

## ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం ఉత్సాహంగా జరుగుతుంది. వివిధ పాఠశాలల విద్యార్థులు శిక్షణా శిబిరానికి క్రమం తప్పకుండా వస్తున్నారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి 11:30 గంటల వరకు రిసోర్స్‌పర్సన్లు జి.కళ్యాణి విద్యార్థులతో రకరకాల నీతి కథలు, మోరల్ స్టోరీస్ చదివించి వాటిలోని సారాంశాలను చెప్పించారు. అనంతరం హేలాపురి చిల్డ్రన్స్ క్లబ్ టీమ్ సభ్యులు, సెక్రటరీ దుర్గాప్రసాద్, రిసోర్స్‌పర్సన్లు టాగోర్ రాజా విద్యార్థులకు దేశభక్తి గీతాలపై అవగాహన కల్పిస్తూ శిక్షణను కొనసాగించారు. ప్రముఖ డ్రాయింగ్ టీచర్, రిసోర్స్ పర్సన్ కె.శంకర్ పలు రకాల డ్రాయింగ్స్ వేసి (చిత్రలేఖనం) విద్యార్థులకు శిక్షణను ఇచ్చారు. అనంతరం రిసోర్స్‌పర్సన్ టి.నళిని, సంగీతం టీచర్ విద్యార్థులకు రకరకాల గీతాలపై సింగింగ్, డ్యాన్సింగ్‌పై అవగాహన కల్పించారు. మధ్యలో విద్యార్థులందరికీ స్నాక్స్ పంచిపెట్టారు. శిక్షణ శిబిరం కార్యక్రమాలను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సిబ్బంది విటి.సందీప్‌కుమార్, ఎండి ఎ.అస్లాం పాషా, ఎం.కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అశోక్ కుటుంబానికి అండగా అంటాం

### సంతాప సభలో వక్తలు

ఆర్థిక సాయం అందిస్తున్న వక్తలు

ప్రజాశక్తి - చింతలపూడి

జర్నలిస్ట్ అశోక్ కుటుంబానికి అండగా ఉంటామని అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు చెప్పారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్ట్ అశోక్ వర్ధన్ సంతాప సభ చింతలపూడి మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు, జిల్లా కోశాధికారి కె.నాగచిన్నారావు, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ జిల్లా వైస్ ప్రెసిడెంట్, ప్రింట్ మీడియా అధ్యక్షుడు ఎస్‌కె.అజాద్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి డాక్టర్ బి.రాంబాబు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి చిన్న రాట్నాలు మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పని చేసే జర్నలిస్టులకు అండగా ఉంటామన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన అశోక్ కుటుంబానికి చేయూత అందిస్తామన్నారు. డిప్యూటీ తహశీల్దార్ షకీలా మాట్లాడుతూ అశోక్ ఎల్లప్పుడూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారన్నారు. మానవత సంస్థ ముఖ్య సభ్యులు సోమశేఖర్, ఎ.అప్పారావు, మదర్ థెరిస్సా ఫౌండేషన్ చైర్మన్ తూము విజయ్‌కుమార్, వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు సూర్య కుమార్, బాబు, తాటి అప్పారావు, బి.నాగభూషణం, శేషగిరిరావు, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు ముత్యాలరావు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అభ్యుదయ సంఘం నాయకుడు కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ అశోక్ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మానవత, మదర్ థెరిస్సా ఫౌండేషన్, విఆర్ఒ అసోసియేషన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు దాతల సాయంతో రూ.54 వేలు, రెవెన్యూ శాఖ నుంచి వంద కేజీల బియ్యం ఎంపిడిఒ రాట్నాలు, ఎంపిపి రాంబాబు చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కిషోర్ వీరయ్య, ముత్తేశ్వరరావు, లక్ష్మణ్, ఖలీల్ సూరిబాబు, కృపావరం, సంజయ్, నత్త వెంకటేశ్వరరావు బాలు, రాంబాబు, సునీల్, పాషి, పలు సంఘాల నాయకులు గురవయ్య, సత్తి బాబు, అబ్రర్ హుస్సేన్ పాల్గొన్నారు.

# మూసివేత దిశగా కళాశాల

శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల

**మూడేళ్ల క్రితం ఎయిడెడ్ హోదా తీసేసిన ప్రభుత్వం**
**ఈ విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్లు నిలుపుదల**
**పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజల వేడుకోలు**

ప్రజాశక్తి - కామవరపుకోట

ఆ కాలేజీలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. కామవరపుకోట గ్రామీణ ప్రాంతంలో ఎంతో మంది పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య అందించి వారు తమ జీవితంలో స్థిరపడేందుకు సహకరించింది ఆ కళాశాల. కామవరపుకోట, చుట్టూ పక్కల అనేక గ్రామాల నుంచి గత 40 ఏళ్లుగా కొన్ని వేల మంది విద్యార్థులను తీర్చిదిద్దింది ఆ కళాశాల. నేడు ఆ కళాశాల మూసివేత దిశగా అడుగులు పడుతున్నాయి.

మండల కేంద్రమైన కామవరపుకోట గ్రామ పంచాయతీలో 1984లో ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాలలో ఈ విద్యా సవంత్సరంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం కొత్త అడ్మిషన్లు పూర్తిగా నిలిపివేశారు. ఈ కళాశాలలో 14 మంది బోధన సిబ్బంది, ఏడుగురు బోధనేతర సిబ్బంది, విద్యార్థులకు కావాల్సిన విశాలమైన తరగతి గదులు, ల్యాబ్స్, అతి పెద్ద ప్లే గ్రౌండ్ ఉన్నాయి. మండలంలో మరే కాలేజీకీ లేని విధంగా అన్ని రకాల వసతులు ఈ కళాశాలకు ఉన్నాయి. సుమారు మూడేళ్ల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ఈ కళాశాలకు ఎయిడెడ్ కళాశాల హోదా తీసివేసింది. అప్పటి నుంచి ప్రయివేట్ కాలేజీగా కొనసాగుతుంది. ఒకప్పుడు 350 నుంచి 400 మంది విద్యార్థులు ప్రతి ఏడాది ఈ కాలేజీలో ఇంటర్ పూర్తి చేసేవారు. గతేడాది కూడా సుమారు వంద మంది వరకు విద్యార్థులు ఉన్నారు. గతంలో ఎయిడెడ్ కాలేజీగా ఉన్న సమయంలో ఫీజులు చాలా తక్కువగా పేద, మధ్య తరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేవి. ప్రయివేట్ కళాశాలగా మారిన తర్వాత యాజమాన్యం ఫీజులను భారీగా పెంచడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఈ కాలేజీ దూరమైంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే సాకుతో కాలేజీ మూసివేత దిశగా మేనేజ్‌మెంట్ చర్యలు తీసుకుంటుంది. ఈ నిర్ణయం పట్ల కామవరపుకోట పరిసర ప్రాంతాల ప్రజలు, కాలేజీ పూర్వ విద్యార్థులు తమ నిరసన తెలిపారు. కళాశాల యాజమాన్యం స్పందించి కాలేజీ మూసివేయకుండా ఈ ఏడాది అడ్మిషన్లు తీసుకుని పెంచిన ఫీజులను తగ్గించి ఇంటర్‌తో పాటు ఎంసెట్, ఐఐటి, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని కోరుతున్నారు.

**కళాశాలకు పూర్వ వైభవం తీసుకురావాలి**

**పెనుమాల ఆనంద్‌కుమార్, పూర్వ విద్యార్థి, వీరిశెట్టిగూడెం**

కాలేజీ యాజమాన్యం వెంటనే స్పందించి పెంచిన ఫీజులను తగ్గించాలి. ఇంటర్‌తో పాటు అన్ని రకాల పోటీ పరక్షలకు శిక్షణ ఇవ్వడం ద్వారా కాలేజీకి పూర్వ వైభవం తీసుకురావాలి.

**ప్రభుత్వం, యాజమాన్యం పునరాలోచించాలి**

**మెడంకి రాజారావు, కామవరపుకోట**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మండల హెడ్ క్వార్టర్‌లో ప్రభుత్వ ఎయిడెడ్ కాలేజీ ఉండాలి. ఈ కాలేజీ విషయంలో ప్రభుత్వం, కళాశాల యాజమాన్యం పునరాలోచించి ఈ కాలేజీకి ఎయిడెడ్ హోదా కల్పించాలి.

## ఎలక్ట్రికల్ ఎఇకి గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలోని తడిచర్ల పంచాయతీలో కొత్తగా నిర్మిస్తున్న 33 కెవి సబ్‌స్టేషన్‌కు 33 కెవి విద్యుత్ స్తంభాలు, తీగలు గ్రామానికి మధ్యలో నుంచి వేసేందుకు అధికారులు సిద్ధం చేసుకుంటున్న ప్రణాళిక మార్చుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు కామవరపుకోట ఎలక్ట్రికల్ ఎఇకి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో వేస్తున్న స్తంభాలు, తీగలు రాన్నున కాలంలో ప్రజలకు అడ్డుగా, ఇబ్బంది కారంగా మారుతాయని, గ్రామం లోపల నుంచి కాకుండా బయట నుంచి వేయాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## రజకుల సమస్యలపై చర్చ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర రజక సంఘం సమావేశం రజకుల చెరువు వద్ద ఉన్న విశ్రాంతి భవనంలో ప్రెసిడెంట్ చెన్నూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రజకుల సమస్యలపై చర్చించారు. పలు అంశాలపై తీర్మానం చేసి ఆమోదించారు. సంఘ సభ్యులు 40 మంది సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో కోశాధికారి అంతర్వేది చిట్టిబాబు, వైస్ ప్రెసిడెంట్ యండమూరి శ్రీను బాబు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

**పాస్‌పోర్టు పోయినది**

పోడూరు మండలం, పోడూరు పెద్దపేట గ్రామానికి చెందిన బద్దా విజయ్‌కుమారి, భర్త: చిరంజీవికు చెందిన M8392087 నెంబర్ గల పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం పోడూరు నుంచి పాలకొల్లు మోటార్ సైకిల్‌పై తీసుకు వెళ్తుండగా మే 25వ తేదీన పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు మార్గ మధ్యలో పడిపోయినది. కావున నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

అడ్రస్: బద్దా విజయ్‌కుమారి
భర్త: చిరంజీవి, ఇంటి నెంబర్: 8-48
పెద్దపేట, పోడూరు మండలం
పశ్చిమగోదావరి జిల్లా, పిన్‌కోడ్: 534327
సెల్: 9989783571

**దస్తావేజులు పోయినవి**

యాతం సత్యనారాయణ, తండ్రి: రంగారావు, ఆచంట మండలం, కరుగోరుమిల్లి ముత్యాలవారి పాలెం, పశ్చిమగోదావరి జిల్లా అను నేను యావన్మందికి తెలియజేయడమేమనగా నాకు సంబంధించి అనగా ఆచంట మండలం, కరుగోరుమిల్లి గ్రామపంచాయతీ పరిధి నాకు సంబంధించి ఇంటి డాక్యుమెంట్స్ 242 స్క్వేర్ యార్డ్స్ ఒరిజినల్ దస్తావేజులు జనవరి 12వ తేదీ 2022 సంవత్సరంలో పోయినవి. బైక్‌కు డాక్యుమెంట్స్ కవరు తగిలించుకుని జిరాక్స్ షాపుకి వెళ్లి వస్తుండగా మార్గ మధ్యలో పడిపోయినవి. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు సంప్రదించగలరు.

అడ్రస్: యాతం సత్యనారాయణ
తండ్రి: రంగారావు
కరుగోరుమిల్లి, ముత్యాలవారిపాలెం
ఆచంట మండలం, పశ్చిమగోదావరి జిల్లా
పిన్‌కోడ్: 534269
సెల్ : 9133609895

**ప్రకటన**

నా క్లయింటు అయిన **శ్రీమతి శానం జయలక్ష్మి, భర్త: ప్రసాదరావు,** నివాసం: 28-1-110/ఎ రు, శాంతినగర్, 1వ రోడ్డు, ఏలూరు నగరం, ఏలూరు జిల్లా అను వారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటు ది. 25-07-2011వ తేదీన ఏలూరు జిల్లా, ఏలూరు నగరం, రామచంద్రరావుపేట, టి.ఎస్. నెం. 2373రులో చ॥గ॥ 100.0.0లు స్థలమును నా క్లయింటు తోడికోడలు అయిన శానం జయలక్ష్మి గారి నుండి దఖలు పొంది ఏలూరు రిజిస్ట్రారు వారి కార్యాలయంలో దస్తావేజు నెం. 5439/2011రుగా రిజిస్ట్రీ పొందియున్నారు. సదరు దస్తావేజును బిర్లాభవన్ సెంటర్‌లోని నా క్లయింటు భర్తగారి షాపు వద్ద ఉంచగా సదరు ఒరిజినల్ దస్తావేజు పోయినది అని ఎంత వెతికినను కనబడలేదు అని తెలియజేసినారు. ఈ రోజు వరకు కనిపించలేదని, సదరు దస్తావేజు నెం. 5439/2011 ఎవ్వరికైనా దొరికిన యెడల తిరిగి నా క్లయింటు అడ్రస్సుకు గానీ, నా యొక్క అడ్రస్సుకి గానీ ఇవ్వగలరు.

కె.వి.పి.మాధవరావు
అడ్వకేట్ - నోటరీ, ఏలూరు
సెల్: 9440111033

**మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), జంగారెడ్డిగూడెం వారి కోర్టులో**

**O.S. No. 74/2022**

Between:

పెనుమాక సత్య దుర్గా జయలక్ష్మి -వాది

Vs

పెనుమాక లలితాంబ మరియు ఆరుగురు -ప్రతివాదులు

4వ ప్రతివాది:

ఆవుల రమా దుర్గ, భర్త: క్రాంతి సాగర్, C/o. పి.ఉషశ్రీ, టీచర్, గౌరీ శంకరపురం, జంగారెడ్డిగూడెం

పై నంబరు దావాలో 4వ ప్రతివాది అయిన మీకు తెలియచేయునది ఏమనగా, పై నంబరు దావా మీ పైన మరియు ఇంకా ఆరుగురి పైన వాది గారు దావాలో పరిహారము నిమిత్తం శ్రీ కోర్టు వారి ఎదుట దావా వేసి ఉన్నారు. సదరు దావాలో మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినా మీరు తీసుకోనందున, మీ హాజరు నిమిత్తం ది. 28-06-2024 తేదీకి వాయిదా కలదు. కనుక ఆరోజు అనగా **ది. 28-06-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పైన తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ తరపు సమాధానము దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పి.ఎస్.ఆర్.కె.లక్ష్మణరావు
అడ్వకేట్, 10-4-101, సుబ్బారెడ్డి కాలనీ
స్థలం: జంగారెడ్డిగూడెం జంగారెడ్డిగూడెం
తేది:27-5-2024 సెల్: 9440328779